పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయండి

● ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


జీహెచ్‌ఎంసీ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అధికారులకు సూచించారు. శనివారం క్యాంపు కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ ముకుంద్‌రెడ్డి, ఇతర అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీలలో ఉన్న సిల్ట్‌ను తీయించాలన్నారు. సిల్ట్ తొలగించే పని వెం టనే చేపట్టమని సూచించారు. అదేవిధంగా ఎస్ఎన్‌డీపీ పనులు సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించి పనులు త్వరగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో హయత్‌నగర్, ఎల్బీనగర్, సరూర్‌నగర్ ఉప కమిషనర్లు తిప్పర్తి యాదయ్య, జకియా సుల్తానా, సుజాత పాల్గొన్నారు.

బీమానగర్‌కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి

చంపాపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని బీమానగర్‌కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు కార్పొరేటర్ సుజాతానాయక్ అన్నారు. కాలనీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడు కె.వెంకటేశ్వర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు శనివారం కార్పొరేటర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు. కాలనీలో పలు సమస్యలను పరిష్కారించాలని కోరు తూ వారు కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి, కాలనీ నూతన అధ్యక్షుడు కె.వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏ.నరేష్, ఉపాధ్యక్షుడు జి.శ్రీకాంత్, కోశాధికారి ఎం.కృష్ణ, కార్యవర్గ సభ్యులు ఎస్.వెంకటేష్‌గౌడ్, ఏ.సత్యనారాయణచారి, భగవాన్‌రెడ్డి పాల్గొన్నారు.

'మెట్' ఇన్‌స్పెక్టర్‌గా అంజిరెడ్డి బాధ్యతల స్వీకరణ



అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా అంజిరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన సైదయ్య కుషాయిగూడ ట్రాఫిక్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఎల్బీనగర్ ఎస్‌హెచ్‌వో అంజిరెడ్డిని అబ్దుల్లాపూర్‌మెట్ ఎస్‌హెచ్‌వోగా నియమిస్తూ రాచకొండ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎల్బీనగర్ ఎస్‌హెచ్‌ఓగా రామాంజనేయులు..

కొత్తపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ నూతన ఎస్‌హెచ్‌ఓగా రామాంజనేయులు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఎల్బీనగర్ ఎస్‌హెచ్‌ఓ అంజిరెడ్డి అబ్దుల్లాపూర్‌మెట్‌కు బదిలీ అయ్యారు. ఎల్బీనగర్ పీఎస్‌లో డీఐగా పనిచేస్తున్న వీరాస్వామి కుషాయిగూడకు బదిలీ అయ్యారు.


టీన్‌షెడ్డు పనులను పరిశీలిస్తున్న ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, ఈఓ

ఆలయంలో టీన్‌షెడ్డు నిర్మాణ పనుల పరిశీలన

చంపాపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లో ప్రసిద్ధిగాంచిన హనుమాన్ ఆలయంలో ధాత కూతాడి ప్రకాష్‌రెడ్డి సహకారంతో చేపట్టిన టీన్‌షెడ్డు నిర్మాణ పనులను శనివారం ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి ఆలయ ఈఓ ఎం.శ్రీనివాసశర్మ, ధర్మకర్తలతో కలిసి పరిశీలించారు. చైర్మన్ మాట్లాడుతూ ప్రధాన ఆలయం ముందు నుంచి ధ్యానాంజనేయస్వామి దర్శనం కోసం విచ్చేసే భక్తులకు ఎండ, వర్షం నుంచి ఇబ్బందులు పడకుండా షెడ్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధి కోసం ధాతలు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ధర్మకర్తలు బబ్బూరి ఆనంద్‌కుమార్‌గౌడ్, మేక సురేందర్ రెడ్డి, మధుసాగర్, సురేష్‌గౌడ్, తిరుమలేష్ పాల్గొన్నారు.

ముగిసిన ప్రత్యంగిరా ఆలయ బ్రహ్మోత్సవాలు

ఎల్బీనగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఆర్‌కేపురంలోని కుర్తాళం పీఠం ఆది పరాశక్తి ప్రత్యంగిరా పరమేశ్వరి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం అన్నాభిషేకం పల్లకీసేవతో ముగిశాయి. యాగమండప దేవతా హోమముల పూర్ణాహుతి, అన్నాభిషేకంలలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్రహ్మం గారి బృందం కోలాట నృత్యం, భక్తి పాటలతో అమ్మవారి పల్లకీ సేవ కనుల పండువగా సాగింది. వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆలయ కార్యదర్శి మునిపల్లె శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

హెచ్‌సీయూ షూటింగ్ రేంజ్‌లో గన్ మిస్‌ఫైర్

● కోచ్‌కు స్వల్ప గాయాలు

రాయదుర్గం : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని షూటింగ్ రేంజ్‌లో తుపాకీ మిస్‌ఫైర్ కావడంతో కోచ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. హెచ్‌సీయూ షూటింగ్ రేంజ్‌లో గతనెల 29 నుంచి మార్చి 10 వరకు 15 మీటర్ల షూటింగ్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం 1.30 గంటలకు వెస్ట్ బెంగాల్‌కు చెందిన బిక్కి దుత్త గన్ లోడ్ చేసి పొజిషన్‌లో ఉన్నాడు. ఈ సమయంలో కోచ్ బిస్వన్ గంగూలి విద్యార్థులందరినీ పరీక్షిస్తూ వస్తున్న క్రమంలో బిక్క దుత్త గన్ మిస్ ఫైర్ అయింది. ఈ ప్రమాదంలో కోచ్ కుడి చేతి చూపుడు వేలుకు గాయమైంది. దీంతో కోచ్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స నిర్వహించారు.

సింథటిక్ ఎఫెక్ట్

14 మంది బోగస్ కార్మికుల తొలగింపు

● కమిషనర్ అత్యవసర సమీక్ష
● ఇద్దరు ఎస్‌ఎఫ్‌ఏలపైనా వేటు

హైదరాబాద్ సిటీ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల బోగస్ హాజరుపై కమిషనర్ సీరియస్ అయ్యారు. పోలీసులకు పట్టుబడిన ఇద్దరు శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్లు(ఎస్‌ఎఫ్‌ఏ), 14 మంది బోగస్ పారిశుధ్య కార్మికులను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సింథటిక్ వేలిముద్రలు వినియోగిస్తూ అంబర్‌పేట సర్కిల్‌కు చెందిన ఎస్‌ఎఫ్‌ఏలు పోలీసులకు పట్టుబడిన నేపథ్యంలో శనివారం సహాయ వైద్యాధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించారు. అంబర్‌పేట సర్కిల్‌లో గుర్తించిన 11 మంది, శేరిలింగంపల్లిలో ముగ్గురు బోగస్ కార్మికులకు సింథటిక్ వేలిముద్రలతో హాజరు వేస్తున్నట్టు గుర్తించారు. ఈ నేపథ్యంలో వారిని తొలగించారు. త్వరలో మరికొందరు ఎస్‌ఎఫ్‌ఏలు, శానిటరీ సూపర్వైజర్లపై వేటు పడే అవకాశం ఉందని ఓ అధికారి తెలిపారు. అంబర్‌పేటలో ఎస్‌ఎఫ్‌ఏలు పట్టుబడడంతో అక్కడి అధికారులను మందలించారని సమాచారం. ఏఎంఓహెచ్‌లు కొందరికి త్వరలో మెమోలూ ఇచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. సింథటిక్ వేలిముద్రలు పని చేయకుండా కొత్త యంత్రాలు అందుబాటులోకి తీసుకువచ్చినా.. పాత మిషన్లు ఎలా వినియోగిస్తున్నారు..? వారికి సహకరిస్తున్నదెవరు..? కేంద్ర కార్యాలయంలోని ఐటీ ఉద్యోగుల పాత్రపైనా కమిషనర్ ఆరా తీస్తున్నట్టు తెలిసింది.

బాక్సింగ్ కోచ్ చిరంజీవి ఆటోబయోగ్రఫీ ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ముక్తేశ్వర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): జాతీయ బాక్సింగ్ మాజీ చీఫ్ కోచ్ ఈ.చిరంజీవి జీవిత చరిత్రను పుస్తక రూపంలోకి తీసుకొచ్చారు. శనివారం కింగ్ కోఠిలోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో వివేక్ తేజ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 20-20 స్క్వేర్ ఫీట్ పేరిట ప్రముఖ రచయిత వి.శ్రీనివాస భాను రచించిన ఈ పుస్తకాన్ని రిటైర్డ్ ఐఏఎస్ ఎస్.ముక్తేశ్వర్ ఆవిష్కరించారు. అనంతరం తొలి ప్రతిని చిరంజీవికి అందించారు. మాజీ బాక్సర్‌గా, అంతర్జాతీయ కోచ్‌గా చిరంజీవి సాధించిన ఘనతలను ఈ సందర్భంగా వక్తలు స్మరించుకున్నారు. ప్రస్తుత వరల్డ్ చాంపియన్, కామెన్వెల్త్ మెడలిస్ట్ నిఖత్ జరీన్ సహా పలువురు అంతర్జాతీయ బాక్సర్లు చిరంజీవి శిష్యులు కావడం విశేషం.

సింగరేణి గుడిసెవాసుల నీటి గోస

● రోజు విడిచి రోజు వచ్చే ఉచిత ట్యాంకర్లే దిక్కు
● కోర్టుతీర్పు వంకతో మంచినీటి పైప్‌లైన్లు వేయలే
● జలమండలి ఆదాయానికి గండిపడుతున్నా స్పందించని అధికారులు

సైదాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఎండాకాలం మొదలవుతుండగానే సింగరేణి కాలనీ బస్తీలో తాగునీటి కష్టాలు షురూ అయ్యాయి. నగరంలోనే పెద్ద బస్తీల్లో ఒకటైన ఐఎస్‌సదన్ డివిజన్‌లోని సింగరేణికాలనీ బస్తీలో నిత్యం కూలీనాలీ చేసుకుంటేనే నాలుగు మెతుకులు వెళ్లే నిరుపేదలు మా త్రమే ఉంటారు. అలాంటిది మంచినీళ్ల కోసం పనులు మానుకొని తంటాలు పడుతున్నారు. ఈ గుడిసెల్లో సుమారు 13వేల కుటుంబాలు 27 ఏళ్లుగా నివసిస్తున్నాయి. ఇందులో అత్యధిక శాతం గిరిజన కుటుంబాలే. గత ప్రభుత్వం మురికివాడలు, బస్తీల్లో రూ.1కే నల్లా పథకం ప్రవేశపెట్టి గ్రేటర్‌లో అన్ని ప్రాంతాల్లో కనెక్షన్లు ఇచ్చి ఉచిత నీటి సరఫరా చేస్తోంది. కానీ సింగరేణి గుడిసెలలో కోర్టు తీర్పు సాకుతో అధికారులు మంచినీటి కనెక్షన్లు ఇవ్వకపోవడంతో జలమండలి ఉచిత ట్యాంకర్లే దిక్కుగా మారింది. రెండు రోజులకొకసారి వచ్చే ట్యాంకర్ ఒక్కో ఇంటికి కేవలం ఒక డ్రమ్ము మాత్రమే నీటిని అందిస్తున్నారు. డ్రమ్ములో పోసిన నీటిని మోటర్లు బిగించి ఇళ్లకు పైప్‌ల ద్వారా తరలిస్తున్నారు.



ఉచిత ట్యాంకర్ల వద్ద నీటిని పట్టుకుంటున్న గుడిసెవాసులు


బస్తీలో రోడ్లపై నిల్వ చేసిన నీటి డ్రమ్ములు

కాంట్రాక్టర్లకు ప్రయోజనం..

సింగరేణి గుడిసెల ప్రాంతానికి ప్రభుత్వ నిధులతో డ్రైనేజీ పైప్‌లైన్లు, సీసీరోడ్లు, విద్యుత్ లైన్లు వేసిన అధికారులు, కేవలం కోర్టు తీర్పు సాకుతో మంచినీటి లైన్లు వేయకపోవడం పలు విమర్శలకు తావిస్తుంది. ట్యాంకర్ల కాంట్రాక్టర్లకు ప్రయోజనం చేకూరేలా జలమండలి ఉన్నతాధికారులు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. సింగరేణి గుడిసెవాసులకు నిత్యం 100-120 ట్యాంకర్ల ద్వారా ఉచితంగా వైశాలీనగర్ రిజర్వాయర్ నుంచి మంచినీటి సరఫరా చేస్తున్నారు. దీని ద్వారా సుమారు రూ.10 నుంచి 12లక్షలు ట్యాంకర్ల యజమానులకు జలమండలి చెల్లిస్తుంది. కేవలం ఒకేసారి రూ.20-30 లక్షల వ్యయంతో గుడిసెల ప్రాంతంలో నీటి కనెక్షన్లు ఇస్తే మంచినీటి సమస్య తీరుతుంది. దీంతో జలమండలికి నెలవారీగా ఆదాయం మిగులుతుంది. అదే జలమండలి శాఖ నీటి కనెక్షన్లు ఇవ్వకుండా డ్రైనేజీ పైప్‌లైన్లు వేయడం గమనార్హం. కోర్టు తీర్పు మంచినీటి పైప్‌లైన్ల విషయంలో వర్తిస్తుందా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

పేదలకు మౌలిక సదుపాయాలు కల్పించాలి



సింగరేణి గుడిసెల ప్రాంతంలో పేద ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కానీ అధికారులు స్వప్రయోజనాలతో అమలు చేయడం లేదు. దీంతో పేదలు మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జలమండలి అధికారులు స్పందించి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి.

- షేక్ మహమూద్, సింగరేణి కాలనీ

మంచినీటి కనెక్షన్లు మంజూరు చేయాలి



గ్రేటర్‌లోని అన్ని మురికివాడలకు మంచినీటి, విద్యుత్, డ్రైనేజీ కనెక్షన్లు ఇచ్చారు. కానీ సింగరేణి గుడిసెలలో డ్రైనేజీ, విద్యుత్ కనెక్షన్లు ఇచ్చి కోర్టు తీర్పు సాకు చూపుతూ జలమండలి కేవలం మంచినీటి కనెక్షన్లు ఇవ్వకపోవడం దారుణం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వివక్ష చూపకుండా ప్రతి గుడిసెకు ఉచితంగా మంచినీటి కనెక్షన్లు మంజారు చేయాలి.

- కొర్ర మోతీలాల్‌నాయక్, సేవాలాల్ బంజారా సంఘం అధ్యక్షుడు

ఉచిత ట్యాంకర్ల సంఖ్య పెంచాలి



వేసవి ఆరంభంలోనే గుడిసెవాసులకు ఉచిత ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా చేస్తున్నా సరిపోవడం లేదు. కూలీ పనులు చేసుకునే మేము మంచినీటి ట్యాంకర్ల కోసం పనులు వదులుకొని ఎదురు చూడాల్సి వస్తుంది. గుడిసెవాసుల అవసరాలకు అనుగుణంగా ఉచిత ట్యాంకర్ల సంఖ్య పెంచాలి.

- వెంకటమ్మ, సింగరేణి గుడిసెల వాసి

తుర్కయంజాల్ వైస్ చైర్‌పర్సన్‌కు తప్పిన అవిశ్వాస గండం..?


తొర్రూర్‌లో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి నివాసం వద్ద సమావేశమైన కాంగ్రెస్ కౌన్సిలర్‌లు

హయత్‌నగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ హరితా ధన్‌రాజ్‌గౌడ్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయే పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్‌లు శనివారం తొర్రూర్‌లోని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఇంటి వద్ద సమావేశమయ్యారు. ఈ నెల 5న మున్సిపాలిటీ కార్యాలయంలో జరగనున్న అవిశ్వాస తీర్మాన సమావేశానికి గైర్హాజరు అవుతామని కాంగ్రెస్‌కు చెందిన కౌన్సిలర్‌లు స్పష్టం చేశారు. దీంతో వైస్ చైర్‌పర్సన్ హరిత అవిశ్వాస గండం నుంచి గట్టెక్కినట్లేనని భావిస్తున్నారు. గత నెలలో తుర్కయంజాల్ మున్సిపాలిటీ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన 18 మంది కౌన్సిలర్‌లు వైస్ చైర్ పర్సన్ హరితపై అవిశ్వాసం ప్రకటిస్తూ సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని రంగారెడ్డి కలెక్టర్‌కు సమర్పించిన విషయం తెలిసిందే. దీంతో కలెక్టర్ మార్చి 5న బలపరీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

అవిశ్వాసానికి హాజరుకాం

● కాంగ్రెస్ కౌన్సిలర్‌లు

వైస్ చైర్ పర్సన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానానికి తాము హాజరుకామని కాంగ్రెస్ కౌన్సిలర్‌లు తెలిపారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయం మేరకే తామంత ఒక్క తాటిపై ఉన్నామని తెలిపారు. శనివారం తొర్రూర్‌లో తుర్కయంజాల్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రాంరెడ్డి కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్‌లతో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి అవిశ్వాసం ఎదుర్కొంటున్న వైస్ చైర్‌పర్సన్ హరితా ధన్‌రాజ్‌గౌడ్‌తో పాటు కౌన్సిలర్‌లు సునీల్, కవిత, బాల్‌రాజ్, ధన్‌రాజ్, కౌశిక ఐలయ్యతోపాటు పలువురు కౌన్సిలర్‌ల భర్తలు, కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు.

వారించిన కాంగ్రెస్ అధిష్ఠానం..?

కాంగ్రెస్ పార్టీకి చెందిన వైస్ చైర్‌పర్సన్‌పై పెట్టిన అవిశ్వాసాన్ని ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ అధిష్ఠానం కౌన్సిలర్‌లను ఆదేశించినట్లు తెలుస్తుంది. ప్రత్యేకంగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చొరవతోనే కౌన్సిలర్‌లు అవిశ్వాస తీర్మానానికి దూరంగా ఉండడానికి తీర్మానించినట్లు తెలుస్తుంది. ఈ నెల 5 వరకు అవిశ్వాసంపై ఉత్కంఠ మాత్రం అలానే కొనసాగే అవకాశం ఉంది.

నేడు పల్స్ పోలియో

● వైద్య సిబ్బందికి శిక్షణ ఇచ్చిన డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మజ


పల్స్ పోలియో కార్యక్రమంపై వైద్య సిబ్బందికి శిక్షణ ఇస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మజ

చాదర్‌ఘాట్. మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేట క్లస్టర్ పరిధిలో ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియోపై మలక్‌పేట క్లస్టర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మజ శనివారం వైద్య సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఐదేళ్లలోపు చిన్నారులకు ఆదివారం ఉదయం 7గంటల నుంచి ప్రారంభమయ్యే పల్స్ పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమం సాయంత్రం 6గంటలకు ముగియనుందని డాక్టర్ పద్మజ తెలిపారు. మలక్‌పేట క్లస్టర్ పరిధిలోని శాలివాహననగర్, మలక్‌పేట, గడ్డిఅన్నారం, జాంబాగ్, మాదన్నపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని 199 కేంద్రాల ద్వారా సుమారు 40,288 మంది ఐదేళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు ఆమె వివరించారు. అదేవిధంగా మలక్‌పేట రైల్వే స్టేషన్‌లో 3రోజుల పాటు ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలియో చుక్కలు వేసేందుకు సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు. వీటితోపాటు మెట్రో స్టేషన్లలో ఉదయం 7గంటల నుంచి రాత్రి 8గంటల వరకు పోలియో చుక్కలు పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. మరో 17 బస్తీ దవాఖానాల్లో కూడా ఐదేళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నారు. ఐదేళ్లలోపు పిల్లలను సమీపంలోని పల్స్‌పోలియో కేంద్రానికి తీసుకెళ్లి పల్స్‌పోలియో చుక్కలు వేయించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.


పల్స్‌పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ప్రధానోపాధ్యాయురాలు శశికళ

పల్స్‌పోలియోపై అవగాహన ర్యాలీ

ఆదివారం జరగనున్న పల్స్ పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు ముసారాంబాగ్ సంజీవయ్యనగర్ బస్తీలోని బాగ్ ముసారిమో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో ప్రధానోపాధ్యాయురాలు శశికళ ర్యాలీ నిర్వహించారు. పోలియో మహమ్మారీ నుంచి ఐదేళ్లలోపు చిన్నారులను కాపాడేందుకు తప్పనిసరిగా రెండు చుక్కల పోలియో నివారణ మందు వేయించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

మూసారాంబాగ్ హైలెవల్ బ్రిడ్జి పనులపై సమీక్ష

● జీహెచ్‌ఎంసీ ప్రాజెక్ట్ విభాగం, టౌన్ ప్లానింగ్ అధికారులతో ఎమ్మెల్యే బలాల సమావేశం


జీహెచ్‌ఎంసీ ప్రాజెక్ట్ అధికారులతో సమావేశంలో ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురుస్తున్నప్పుడు ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లో పెరిగిన నీటి మట్టాలను తగ్గించేందుకు మూసీలోకి నీటిని వదలినప్పుడల్లా మునిగిపోయే మూసారాంబాగ్ కాజ్ వే బ్రిడ్జి స్థానంలో కొత్తగా హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ఒకవైపు పనులు మొదలయ్యాయి. మరో వైపు ఈ హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం కారణంగా మూసారాంబాగ్ బ్రిడ్జి నుంచి భారత్ పెట్రోల్ బంకు వరకు రోడ్డు కిరువైపులా ఉన్న భవనాలు రోడ్డు వెడల్పులో కూల్చివేసేందుకు మార్కింగ్ చేశారు. దీనిపై స్థానిక భవనాల యజమానులు, వ్యాపారస్థులు తమ జీవనాధారమైన వ్యాపార కేంద్రాలు కూల్చివేయవద్దంటూ పలుమార్లు మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాలకు విన్నవించుకున్నారు. ఈమేరకు శనివారం ఎమ్మెల్యే జీహెచ్‌ఎంసీ ప్రాజెక్ట్ విభాగం అధికారులతో సమావేశమై చేసిన మార్కింగ్‌లో కేవలం 25శాతమే కూల్చివేసేలా ప్రాజెక్ట్ డిజైన్‌లో మార్పు చేయాలని సూచించారు. హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం కారణంగా ప్రస్తుతం ఉన్న రోడ్డును వెడల్పు చేసే అవకాశం లేకుండా రోడ్డు మధ్యలో భారీ డివైడర్ స్థానంలో సింగిల్ డివైడర్ నిర్మించాలని ఇటీవల ఈఈ సురేష్, ఏఈఈ ప్రశాంత్, బాధిత వ్యాపారులు అశోక్‌కుమార్, ధనుంజయ, రాజశేఖర్‌లతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే సూచించారు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ ప్రాజెక్ట్ అధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారుల సమన్వయంతో హై లెవల్ బ్రిడ్జికి సమాంతరంగా నిర్మించే రోడ్డు ప్రణాళికలో మార్పు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఇలా చేయడం ద్వారా హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ఆటంకాలు జరగకుండా ఉండడంతోపాటు ఇటు జీవనాధారమైన వ్యాపార సంస్థలు కూల్చివేతకు గురికాకుండా కాపాడిన వారమవుతామని ఎమ్మెల్యే ప్రాజెక్ట్ అధికారులకు సూచించారు.



సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సైదిరెడ్డిని యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి సత్కారించారు. శాంతిభద్రతల పరిష్కారంలో తమ వంతు సహకారం అందిస్తామని వారు చెప్పారు. యువజన కాంగ్రెస్ నాయకులు రేపాల వినయ్, రాఘవేంద్ర, పురుషోత్తం, శశియాదవ్ పాల్గొన్నారు.

- ఎల్బీనగర్, ఆంధ్రజ్యోతి

ఇంటి తాళం పగులగొట్టి చోరీ


బెడ్‌పై చిందరవందరగా వస్తువులు

కొత్తపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ పీఎస్ పరిధి కాకతీయ కాలనీలో గుర్తు తెలియని దుండగులు ఓ ఇంటి తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. పోలీసులు, బాధితుడి కథనం ప్రకారం.. కిషోర్ అనే ప్రైవేటు ఉద్యోగి కుటుంబ సభ్యులతో కలిసి కాకతీయ కాలనీలోని ఓ భవనం మొదటి అంతస్తులో ఉంటున్నాడు. వారు ఫిబ్రవరి 29వ తేదీన నల్లగొండ చండూరుకు వెళ్లి శనివారం ఉదయం కాలనీకి వచ్చారు. ఇంటి తాళం పగులగొట్టి ఉండడంతో చోరీ జరిగిందని భావించి, లోపలికి వెళ్లి చూశారు. బెడ్ రూమ్‌లో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువా తలుపులు తెరచి ఉన్నాయి. అందులో దాచిన విలువైన నగలు, ఇంట్లో దాచుకున్న నగదు దుండగులు ఎత్తుకెళ్లారని తెలుసుకున్నారు. వెంటనే కిషోర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌హెచ్‌ఓ రావాంజనేయులు, ఎస్ఐ శంకర్ సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకుని, క్లూస్ టీంకు సమాచారం ఇచ్చారు. 7తులాల బంగారు నగలు, 50వేల నగదు దొంగలు ఎత్తుకెళ్లారని పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటన స్థలంలో పరిశీలించగా నల్ల పూసల బంగారు గొలుసు, కొంత నగదు దొరికినట్లు సమాచారం. బంగారు చెవి దుద్దులు కనిపించలేదని తెలిసింది. క్లూస్ టీం వేలిముద్రలు, తదితర ఆధారాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



హయత్‌నగర్ కోర్టులో ఫ్రీ లోక్ అదాలత్‌లో జడ్జి సల్మా ఫాతిమా తదితరులు

హయత్‌నగర్ కోర్టులో ఫ్రీ లోక్ అదాలత్

● 222 కేసులు రాజీ

హయత్‌నగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లోని 14వ అదనపు కోర్టు ప్రాంగణంలో శనివారం జడ్జి సల్మా ఫాతిమా అధ్యక్షతన ఫ్రీ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా హయత్‌నగర్, వనస్థలిపురం, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని కక్షిదారులు 222 కేసులలో రాజీ కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ రాజీ మార్గమే రాచమార్గమని అన్నారు. అనవసర విషయాలలో గొడవలు పడి కేసులు పెట్టుకుని సమయాన్ని, డబ్బులు వృథా చేసువద్దని కోరారు. రాజీపడిన కక్షిదారులను జడ్జి అభినందించారు. కార్యక్రమంలో రిటైర్డ్ జడ్జి సరళాకుమారి, ఏపీపీ అరుణోదయకుమార్, నూతన్, వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి, సీఐలు రామకృష్ణ, అశోక్‌రెడ్డి, అంజిరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్, బెంచ్ మెంబర్ సతీష్ పాల్గొన్నారు.

డ్రగ్స్ ఫ్రీ సిటీగా మార్చేందుకు..

విద్యాశాఖతో కలిసి పోలీసుల ప్రణాళిక

హైదరాబాద్ సిటీ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ ఫ్రీ సిటీలో భాగంగా డ్రగ్స్‌కు అడ్డుకట్ట వేసేందుకు విద్యాశాఖతో కలిసి పోలీసు అధికారులు కార్యాచరణ రూపొందించారు. ఇందులో భాగంగా వివిధ స్కూళ్లకు చెందిన విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించనున్నారు. దీనికి సంబంధించి ఆదివారం కమాండ్ కంట్రోల్ రూములో విద్యాశాఖ సెక్రటరీ బి.వెంకటేశం, కమిషనర్లు కొత్తకోట శ్రీనివాసరెడ్డి, అవినాష్ మహంతి, తరుణ్‌జోషి, టీఎస్‌న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, యాంటి నార్కొటిక్స్ ఫోరం జాయింట్ సెక్రటరీ కేజీఎస్ఎస్ శ్రీకాంత్‌తో కలిసి సమావేశం నిర్వహించనున్నారు.

సిటీ పోలీస్ కో ఆపరేటివ్ సొసైటీ కమిటీ ఎన్నిక

హైదరాబాద్ సిటీ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సిటీ పోలీస్ కో ఆపరేటివ్ సొసైటీ నూతన కమిటీని ఎన్ను కున్నారు. శనివారం సెంట్రల్ జోన్ డీసీపీ కార్యాలయంలో డిప్యూటీ రిజిస్ట్రార్ శ్రీరామ్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. వైస్ ప్రెసిడెంట్‌గా మహ్మద్ ఆసిఫ్‌ఖాన్, సెక్రటరీగా నల్లా శంకర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా సి.నవీన్‌కుమార్, ట్రెజరర్‌గా జీఎస్ఎం విక్టర్‌ను ఎన్నుకున్నారు. సొసైటీ డైరెక్ట ర్లుగా కొనిదెల రత్నకుమారి, యాంతని సుసాయి దయామని శాంతి, కేశవ్ మామిడి, దండు లక్ష్మణ్‌కుమార్, పి.వినీత్, బి.అప్పలసూరి ఎన్నుకోబడ్డారు. ఈ కమిటీ 2029 ఫిబ్రవరి 28వరకు అధికారంలో ఉంటుందని సెక్రటరీ తెలిపారు.

బకాయిలు చెల్లిస్తేనే ఔషధాలు సప్లై

● ట్విన్ సిటీస్ హాస్పిటల్స్ సప్లయర్స్ అసోసియేషన్

పంజాగుట్ట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి తమకు రావాల్సిన బకాయిలు చెల్లించకపోతే ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు ఈఎస్ఐసీలకు సైతం అత్యవసర ఔషధాలు, చికిత్సలకు వినియోగించే వైద్యపరికరాలను సరఫరా చేయలేమని ట్విన్ సిటీస్ హాస్పిటల్స్ సప్లయర్స్ అసోసియేషన్ స్పష్టం చేసింది. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు రాంచందర్, సభ్యులు మాట్లాడారు. ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా టెండర్లు పొంది గాంధీ, ఉస్మానియా, నిమ్స్, నిలోఫర్‌లతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రులు, ఈఎస్ఐసీలకు ఔషధాలు, రోగులకు అవసరమైన వైద్య పరికరాలను సరఫరా చేస్తున్నామని, గతేడాది ఆగస్టు నుంచి తమకు రావాల్సిన బకాయిలు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వక్తలు తెలిపారు. సంబంధిత అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా ప్రయోజనంలేదని వాపోయారు. రోగులకు ఇబ్బంది పెట్టే ఉద్దేశం తమకు లేదని, ఆర్థిక వనరుల లేమితో సరఫరా చేయలేని దుస్థితి నెలకొందన్నారు. సమస్య జటిలం కాక ముందే ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేయాలని కోరారు. టీఎస్ఎంఐడీసీ నుంచి రూ.300 కోట్లు, ఈఎస్ఐసీ నుంచి రూ.100 కోట్లు, నిమ్స్ నుంచి సుమారు రూ.50 కోట్లు, ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల జనరల్ బడ్జెట్ నుంచి బకాయిలు రావాల్సి ఉందన్నారు. ఈనెల 31లోపు బకాయిలు చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

గ్రేటర్‌లో కొనసాగుతున్న గృహజ్యోతి జీరో బిల్లింగ్

● ఎమ్మెల్సీ కోడ్‌తో రంగారెడ్డిజోన్‌లో ప్రారంభం కాని జీరో బిల్లింగ్
● పలు ప్రాంతాల్లో ప్రక్రియను పరిశీలించిన ఉన్నతాధికారులు

హైదరాబాద్ సిటీ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకొని గృహజ్యోతి లబ్ధిదారులుగా ఎంపికైన వినియోగదారులకు విద్యుత్‌శాఖ జీరో విద్యుత్ బిల్లులు జారీచేస్తుంది. మెట్రో జోన్‌పరిధిలోని ఆసిఫ్‌నగర్ సెక్షన్‌లో జీరో బిల్లుల జారీని మెట్రో సీజీఎం నరసింహస్వామి శనివారం పరిశీలించారు. సెంట్రల్ సర్కిల్ ఎస్ఈ బ్రహ్మంతో కలిసి పలు ప్రాంతాల్లో జీరో బిల్లుల జారీ ప్రక్రియను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులందరికీ జీరో బిల్లులు జారీచేస్తున్నామని, ఎక్కడ సమస్యలు తలెత్తినా అధికారులు వాటిని వెంటనే పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ప్రజాపాలనలో దరఖాస్తుచేసుకోలేని వారు ఎవరైనా జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయాల్లో వివరాలు నమోదుచేసుకునే అవకాశముందన్నారు. బిల్లుల జారీలో ఏవైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సర్కిల్, డివిజన్, సెక్షన్ స్థాయిలో జీరో బిల్లుల జారీ సజావుగా సాగుతుందన్నారు.

ఎమ్మెల్సీ కోడ్‌తో రంగారెడ్డిలో ప్రారంభం కానీ జీరో బిల్లింగ్..

రంగారెడ్డిజోన్ పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో గృహజ్యోతి జీరో బిల్లింగ్ జారీకి బ్రేక్ పడింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో సరూర్‌నగర్, సైబర్‌సిటీ, రాజేంద్రనగర్ సర్కిళ్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో జీరో బిల్లులు జారీచేయడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా గృహజ్యోతి జీరో బిల్లింగ్ ప్రక్రియ ప్రారంభం కావడంతో తమకు ఎప్పుడు బిల్లులిస్తారంటూ స్థానికులు విద్యుత్ అధికారులను ప్రశ్నిస్తున్నారు. భవిష్యత్‌లో జీరో బిల్లులు జారీచేస్తామని అధికారులు చెబుతున్నారు.